"ఒక్క జడే"

"కాదు, రెండు జడలు."

"రెండు కాదు, ఒక్కటే!"

"రెండంటుంటే!"

"పందెం."

"ఎంత?"

"అయిదు."

"చాలదు. పది."

"సై."

"పదే."

"అయితే తియ్యి."

వెంటనే చొక్కా జేబులోంచి పైకే కనిపిస్తున్న కొత్త పది రూపాయల దొంతరలోంచి ఒక నోటును పర్రున బయటికి లాగాడు అంజిబాబు.

అంజిబాబుకు ప్రత్యర్థి అయిన అప్పలరాజు మాత్రం తక్కువ తిన్నాడా! అంతకుముందు రోజే జీతాలుతీసుకొని ఉండటంవల్ల అతనిజేబూ నిండుగానే ఉంది. తనూ ఒక కొత్త పది రూపాయల కాగితాన్ని నిర్లక్ష్యంగా పైకి లాగాడు.

ఇద్దరూ కలిసి కూడబలుక్కున్నట్టు ఒక్కసారే "పట్టుకోండి, గురూగారూ!" అంటూ నా చేతి కందించారు రెండు పది రూపాయల కాగితాల్ని.

మరోటీ మరోటీ అయితే అసలు విషయం తెలుసుకోకుండా అందుకొనే మనస్తత్వంకాదు నాది. వాళ్ళు అందిస్తున్నది డబ్బాయెను! అందునా ఒకటో రెండో కాదు—రెండు పదులు—అక్షరాలా ఇరవై రూపాయలు. ఇస్తున్న డబ్బును వద్దనటం ఎందుకని ముందు తీసుకొని, తర్వాత "ఏమిటి కథ?" అని ప్రశ్నించాను.

దీనికి రంగస్థలం మా ఆఫీసు రిక్రియేషన్ క్లబ్. అప్పుడే ఆ గదిలోకి నేను అడుగుపెట్టి ఉండటంవల్ల పైన ఉదహరించిన ఆ నాలుగు పొడి మాటలే నా చెవిన పడ్డాయి. అప్పటికి ఎంత సేపటినుంచి వాళ్ళిద్దరూ వాదించు కొంటున్నారో, దానికి పూర్వ రంగం, మూల కథ, కమామీషూ నాకు తెలీవు.

అందుకనే విస్మయాహమాటంగా అడగవలసి వచ్చింది.

నా ప్రశ్నకు వాళ్ళిద్దరూ పోటీ పడి సమాధానం చెప్పారు.


పందెం వివరాలు విన్న నాకు చెప్పలేనంత ఆశ్చర్యం కలిగింది.

ఇక్కడ కొంత పూర్వ కథ చెప్పుకోవాలి.

ఇరవై మంది మగధీరులు పని చేస్తున్న మా ఆఫీసులో ఒక నిట్ట మధ్యాహ్నం తళుక్కున ఒక విద్యుల్లత మెరిసింది. కళ్ళు చెదిరి, కాస్సేపటికి తేరుకొని, పరకాయించి చూద్దుం కదా— ఆ విద్యుల్లత ఒక ఆడమనిషి రూపం దాల్చింది. పద్దెనిమిదీ— ఇరవై సంవత్సరాల వయస్సుగల ఆ విద్యుల్లత పేరు పద్మలతాదేవి అని తర్వాత తెలిసింది.



# పందెం




మా ఆఫీసులో పని చేస్తున్న ఇరవై మంది మగవాళ్ళలోనూ రకరకాల వయసుల వాళ్ళున్నారు. పిల్లలకి పెళ్ళిళ్ళు చేసినవాళ్ళు, పిల్లల్ని కనటం చాలించిన వాళ్ళు, పిల్లల్ని కంటూ ఉన్నవాళ్ళు, పిల్లల్ని కనవలసిన వాళ్ళు, ఇంకా పెళ్ళి కానివాళ్ళు. . . అన్ని రకాలవాళ్ళూ ఉన్నారు.

ఒక్క క్షణం మెరుపులా మెరిసి, కళ్ళు చెదరగొట్టి మరుక్షణమే మానవ స్త్రీ రూపం దాల్చి, దివి నుండి భువికి దిగి వచ్చిన దేవ కన్యలా మా కళ్ళ ముందు సాక్షాత్కరించిన ఆ పద్మలతా దేవి—మా ఆఫీసులోనే, మా అందరి మధ్యనే, మాతో కలిసి మెలిసి పని చేయటానికి మా ఏలిన వారిచే ఎన్నిక చేసి పంపబడిన 'నూతనోద్యోగిని' అని తెలిసిన క్షణంలో వయోభేదం లేకుండా అందరి మనస్సుల్లోనూ ఒకే విధమైన సంచలనం బయలుదేరింది. అది సంభ్రమమే అనాలో, సంతోషమే అనాలో, లేక మరోటేదన్నా అనాలో నాకైతే ఇప్పుడు తోచటం లేదు కాని, ఆ క్షణం నుంచీ ఆఫీసు వాతావరణమే మారిపోయింది. ఇది నిజం. ఇందుకు ఎన్నో సాక్ష్యాధారాలు కొట్టవచ్చినట్టు కనిపించినాయి.

ఇది జరిగి సంవత్సరాలు కాలేదు. నెలలు కాలేదు. రోజులు—కేవలం పది రోజులు మాత్రమే అయింది. ఈ పది రోజుల స్వల్ప కాలంలోనూ ఎన్నో పరిణామాలు జరిగిపోయినాయి.

సుబ్బారావు అనే గుమాస్తా వారానికి ఒక్కసారి గూడా గడ్డం గీసుకొనేవాడు కాదు. ఎప్పుడూ మాసిన గడ్డంతో నీరసంగా కనిపించేవాడు. అలాంటిది పద్మలతాదేవి ఆఫీసులో చేరిన మరునాటి రోజే అతని గడ్డం నున్నగా నిగనిగలాడుతూ, నీళ్ళు కనిపించేంత నీటుగా తయారయింది. అప్పటికి బాగా పెరిగి ఉండటంవల్ల గడ్డం చేసుకొచ్చాడేమో లెమ్మని సరిపెట్టుకున్నాం. కాని, ఆ రెండో రోజు కూడా అతని గడ్డం అంత నున్నగానే కనిపించింది. మూడో రోజున గూడా మార్పు కనిపించలేదు. ఇప్పటికి పది రోజులైనప్పటికీ అతని గడ్డం మాత్రం అంతకుముందే 'షేవ్' చేసుకొచ్చినంత తాజాగా కనిపిస్తూంది!

పుష్కరం క్రితమే ప్యాంటులు విసర్జించి పంచె కట్టు ప్రారంభించిన పానకాలస్వామి అనే హెడ్ గుమాస్తా, "మా పంచెకట్టులో ఉన్న సౌఖ్యం మీ ప్యాంట్లలో ఎక్కడుంటుందోయ్!" అంటూ తరుచూ కుర్రకారుని విమర్శించే పెద్దమనిషి, ఈ పది రోజుల కాలంలోనే రెండు ప్యాంట్లూ, రెండు షర్టులూ కుట్టించేసి, 'ఇదే సౌఖ్యంగా ఉన్నట్టుందోయ్!' అంటూ పళ్ళికిలించసాగాడు.

పై జేబులో హనుమాన్ చాలీసా, చేతిలో భగవద్గీతో, లేక ఆధ్యాత్మ రామాయణమో పట్టుకుని ఎప్పుడూ భక్తి, ముక్తి, వైరాగ్యం గురించి ఉపన్యాసాలు దంచుతూ, వేదాంతిగా చలామణీ అవుతున్న రామదాసుగారుకూడా ఇప్పుడు హిందీ సినిమాల గురించీ, సీరియల్ నవలల గురించీ ముచ్చటిస్తున్నారు.

గుమాస్తాగా ఉద్యోగ జీవితం ప్రారంభించి, అంచెలంచెలుగా ప్రమోషన్ల సోపాన పంక్తి నధిరోహించి, రిటైరు కావటానికి సిద్ధంగా ఉన్న వయసులో ఆఫీసర్ కాగలిగిన మా 'అయ్యగారు'కూడా ఈ ప్రలోభానికి లోనుగాక తప్పలేదు. ఎప్పుడో వయసులో ఉండగా కుట్టించుకున్న ఖరీదైన సూటు ఒక టుం దాయనకు. ప్రత్యేక సందర్భాలలో తప్ప మామూలు రోజుల్లో అది ధరించే అలవాటు లేదాయనకు. అలాంటిది పద్మలతాదేవి ఆఫీసులో ప్రవేశించిన మరుసటి రోజునే ఆ సూటు బయటికి తీశాడాయన. పాతబడి పోవటం వల్ల బకిల్సు వూడిపోయాయి ప్యాంటుకి. అయినా అది గమనించకుండా బొడ్డుకు బెత్తెడు పైన 'టక్' చేసుకుని వారం రోజులు వరస విడవకుండా అదే తొడిగేశాడాయన. దానికి తోడు ముసలి బూటు ఒకటి రిపేరు చేయించి వేసుకోవటం మొదలు పెట్టాడు. పైగా అంతకు ముందు తన చుట్టూ ఒక గిరి గీసుకుని, ముఖాన గంటు పెట్టుకుని, చీటికీ మాటికీ చిర్రు బుర్రులాడుతూ, చిందులు తొక్కుతూండేవాడు. ఇప్పుడైతే అందుకు పూర్తిగా విరుద్ధం. అందర్నీ స్వయంగా పలకరిస్తున్నాడు. నవ్వుతూ మాట్లాడుతున్నాడు. తరుచు చలోక్తులుకూడా విసురుతున్నాడు.

ఇది పెద్దమనుషుల సంగతి. వీళ్ళ వ్యవహారం అలా ఉంది. ఇంక కుర్ర కారున్నారు. కొత్తగా పెళ్ళైన వాళ్ళూ, పెళ్ళి కావలసిన వాళ్ళూ...వాళ్ళను పట్ట పగ్గాలే లేకపోయినాయి. వాళ్ళ చేష్టలు, హావభావ ప్రకటనలు... ఒకటా రెండా వర్ణించి చెప్పటానికి? అందులో ఈ అప్పలరాజు, అంజిబాబు లైట్ మరీను. అచ్చంగా కాలు కాలిన పిల్లులే అయిపోయారు.

అయ్యా, ఇది పూర్వ కథ. ఇంక ప్రస్తుత కథాంశానికి వస్తే...

వస్తూనే ఇంత కొత్తదనాన్ని తనతో మోసుకు వచ్చిన పద్మలతాదేవి, వచ్చిన తరవాత మాత్రం కొన్ని ప్రత్యేక పరిస్థితుల్ని సృష్టించకుండా ఎలా ఉంటుంది? సృష్టించే తీరింది.

మొదటి రోజు—నాకు బాగా గుర్తుంది—ఒక్క జడే వేసుకుని కొత్త పెళ్ళికూతురులా సిగ్గు పడుతూ, వంచిన తల ఎత్తకుండా ఒద్దికగా ప్రవర్తించింది.

రెండో రోజు రెండు జడలు వేసుకుని, కాస్త తలెత్తి నలుగుర్నీ తేరి చూసింది.

మూడో నాడు మళ్ళీ ఒక్క జడే వేసుకొచ్చింది.

నాలుగో నాడు ఒక్క జడో, రెండు జడలో నే నంతగా పరిశీలించ లేదు. అయితే ఒకటి మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. ఈ పది రోజులలోనూ కొన్ని రోజులు ఒక్క జడ, కొన్ని రోజులు రెండు జడలు



వేసుకొచ్చింది. అయితే ఎన్ని రోజులు ఒక్క జడ వేసుకుందో, ఎన్ని రోజులు రెండు జడలు వేసుకుందో, ఏ క్రమంలో అవి వెయ్యటం జరిగిందో మాత్రం నేను చెప్పలేను. కారణం—ఆ విషయం అంత ముఖ్యమైనదిగా భావించక పోవటమే! వయసులో ఉన్న ఆడపిల్ల ఒక్క జడ వేసుకున్నా అందంగా ఉంటుంది. రెండు జడలు వేసుకున్నా అందంగానే ఉంటుంది అనుకున్నాను కానీ, ఆ జడల వ్యవహారం తరవాత తరవాత ఇన్ని సిద్ధాంత రాద్ధాంతాలకు దారి తీస్తుందని వూహించ లేకపోయాను.

నేనూ, నా బోటి మరి కొందరూ ఆ జడల వ్యవహారాన్ని అంత తేలిగ్గా వదిలెయ్యటం జరిగింది. కాని, అప్పలరాజూ, అంజిబాబూ అలా వెయ్యలేకపోయారు. వాళ్ళ దృష్టిలో అది చాలా ముఖ్యమైన విషయమై కూచుంది.

పద్మలతాదేవి ఏ రోజున ఎన్ని జడలు వేసుకొచ్చిందీ వాళ్ళు బాగా పరిశీలించి గుర్తు పెట్టుకున్నారు. అందుచేత ఆమె ఏ రోజున ఎన్ని జడలు వేసుకొచ్చిందీ అన్న విషయంలో వాళ్ళకి పేచీ లేదు. వచ్చిన తగువెక్కడంటే, పద్మలతాదేవి రేపు ఎన్ని జడలు వేసుకుని ఆఫీసు కొస్తుందీ? అని.

ఒక్క జడా?

రెండు జడలా?

ఒక్క జడే అని అప్పలరాజు.

రెండు జడలని అంజిబాబు.

ఏ ఆధారాలు చూసుకుని లెక్కవేసే ఆ నిర్ణయాని కొచ్చారో తెలియదు కానీ, ఎవరి నిర్ణయం పట్ల వాళ్ళకి సంపూర్ణ విశ్వాసం ఉన్నట్లు నాకా సందర్భంలో తోచింది.

ఒక్క జడే వేసుకొస్తుందని అప్పలరాజూ, రెండు జడలే వేసుకొస్తుందని అంజిబాబూ పూర్తిగా విశ్వసిస్తున్నారు. ఆ విషయంలోనే ఆ సాయంత్రం వేళ రిక్రియేషన్ క్లబ్ రూంలో మాటా మాటా వచ్చింది. పట్టుదల పెరిగింది. పందెం వరకూ వెళ్ళింది.

వాళ్ళిద్దరి అభ్యర్థన మేరకు మధ్యవర్తిత్వం వహించక తప్పలేదు నాకు. చెప్పకపోవటమేం—వాళ్ళ పట్టుదల, పందెం కట్టటం చూసిన తరవాత ఆ విషయంలో నాకూ కొంత కుతూహలం కలిగింది.

ఎందుకైనా మంచిదని ఆ సమయానికి అక్కడ దొరికిన మరో ఇద్దర్ని సాక్షులుగా వేసుకున్నాం.

పద్మలతాదేవి మరుసటి రోజు ఒక్క జడే వేసుకుని ఆఫీసుకు వచ్చినట్లైతే రెండు పదులూ అప్పలరాజు కిచ్చేటట్టు, రెండు జడలు వేసుకుని వచ్చినట్టైతే అంజిబాబు కిచ్చేటట్టు పందెంయొక్క షరతు.

సరే అంటే సరే లెమ్మనుకుని, బాగుందంటే బాగుందనుకుంటూ అప్పటికే ఆరుంబావు కావటం వల్ల ఎవరి దారిన వాళ్ళు ఇళ్ళకు వెళ్ళిపోవటం జరిగింది.

వాళ్ళిద్దరూ ఇచ్చిన రెండు పది రూపాయల నోట్లూ నా జేబులోనే ఉన్నాయి.

దారి పొడుగునా ఇదే ఆలోచన నాకు.

రేపు అమ్మాయి ఒక్క జడ వేసుకొస్తుందా? రెండు జడలు వేసుకొస్తుందా?

ఆమె ఒక్క జడ వేసుకొచ్చినా, రెండు జడలు వేసుకొచ్చినా తత్సంబంధమైన గెలుపు— ఓటమీ పంచుకోవలసిన వాళ్ళు అప్పలరాజూ, అంజిబాబూను. అందువల్ల నాకు రాబోయే లాభమూ లేదు, నష్టం అంతకన్నా లేదు. అయినా కుతూహలం క్షణ క్షణాభివృద్ధి చెందసాగింది.

• •

నేను ఇల్లు చేరేసరికి భోజనాలు ముగించి వరండాలో లైటు దగ్గర చదువుకోవటానికి సన్నాహాలు చేస్తున్నారు మా చిరంజీవులు.

నేను విడిచి ఇచ్చిన చొక్కా అందుకుని హేంగ కొయ్యకు తగిలించబోతున్న మా ఆవిడ దృష్టికి అప్రయత్నంగానే జేబులో ఉన్న రెండు పది రూపాయల కాగితాలు కనిపించాయి.

ప్రశ్నార్థకంగా చూసింది నా వంక.

"కాస్త జాగ్రత్త చెయ్యవోయ్—రేపు ప్రొద్దుట ఇద్దువుగాని..."

"ప్రొద్దుట మీరు డబ్బు తీసుకువెళ్ళినట్టు లేదు. ఎక్కడిదీ డబ్బు?"

"దీని కో పెద్ద కథ ఉందిలే!"

"కథా? నాకు చెప్పకూడదా?"

"ఎందుకు చెప్పకూడదూ? తప్పకుండా చెప్తాను. ఇదో తమాషా అయిన కథ" అంటూ ప్రారంభించి, పద్మలతాదేవి యొక్క కార్యాలయ ప్రవేశ వృత్తాంతం, అటు తరవాతి పరిణామాలు, అప్పలరాజూ అంజిబాబుల పందెం షరతులు, నా మధ్య వర్తిత్వం . . . వగైరాలు వివరంగా చెప్పాను.

తమాషా అయిన కథ చెప్పినందుకు సంతోష పడుతుందని భావించాను గాని, నా అంచనా తప్పే అయింది.

కొద్ది క్షణాల మౌనం తరవాత — "ఆ అమ్మాయి వయసెంత ఉంటుంది?" అని సాలోచనగా అడిగింది.

తప్పేముంది లెమ్మనుకుని— "పద్దెనిమిదీ—ఇరవై మధ్య ఉంటుంది" అన్నాను.

"అందంగా ఉంటుంది కదూ?"

"మన పెళ్ళికి ముందు కనిపించి ఉంటే నిన్ను మానేసి ఆ అమ్మాయినే చేసుకుని ఉందునేమో" అని జోక్ చేశాను.

"పెళ్ళైందా?"

"పెళ్ళా—" అంత వరకు నా కా వూహే రాలేదు. అయినా ఆ అమ్మాయిలో పెళ్ళైన చిహ్నాలేవీ కనిపించలేదు నాకు. ఆ మాటే అన్నాను.

"అదన్న మాట అసలు కథ!" అంటుంటే మా శ్రీమతి గొంతు కొత్తగా వినిపించింది నాకు. ఏదో పెద్ద రహస్యాన్ని ఛేదించగలిగా నన్నంత ధీమా ధ్వనించింది కంఠంలో.

అనుమానం వచ్చి, కాస్త పరిశీలనగా చూశాను మా ఆవిడ ముఖంలోకి. ఇంత సేపూ ఏదో సరదాగా మాట్లాడుతూందని భ్రమపడ్డాను. కాని, ఆవిడ ఎంతో సీరియస్‌గా తీసుకుంది ఆ విషయాన్ని. అది గ్రహించగానే నాకు కంగారు పుట్టింది.

అనవసరంగా లేనిపోని గొడవ తెచ్చి పెట్టుకున్నానే అని లోలోపలే బాధపడుతూ— "కథేమిటోయ్" అన్నాను నీరసంగా.

నా ప్రశ్నకు సమాధానం చెప్పకపోగా, "మీరు ఆఫీసు కెళ్తున్నది దేనికి? ఉద్యోగం చెయ్యటానికేనా?" అంటూ మాట మార్చి ప్రశ్నించింది.

ఆమె ధోరణి అంతుబట్టలేదు నాకు. అయినా సమాధానం చెప్పాను. "అందులో సందేహం దేనికి?"

"నమ్మమంటారా?"

"అయ్యో రామా! ప్రతి నెలా జీతం తెస్తున్నానుకదోయ్! ఉద్యోగం చెయ్యకుండా జీతం ఎవడిస్తాడు?"

"అయితే మీరు చేస్తున్న ఉద్యోగం ఇదే అయ్యుండాలి!"

"ఏది?"

"ఏ ఆడపిల్ల ఎన్ని జడలు వేసుకుంటుంది? ఏ ఆడది ఏ చీర కడుతుంది? ఎలాంటి నగలు పెట్టుకుంటుంది — ఎలా అలంకరించుకుంటుంది — ఎలా నడుస్తుంది . . . ఇవి పరిశీలించటమేగా మీరు చేసే ఉద్యోగం?"


ఇప్పటికి ఆమె ధోరణి పూర్తిగా అర్థమై నవ్వొచ్చింది నాకు. గట్టిగా పొట్ట చెక్కలయ్యేలా నవ్వేశాను.

నే నలా విరగబడి నవ్వుతూంటే ఆవిడగారికి కోపం వచ్చింది. "ఎందు కలా పిచ్చాడిలా నవ్వుతారు?" అంది విసుగ్గా.

"నవ్వు కాకపోతే మరేమిటోయ్? తమాషా అయిన కథ కదా అని అడగగానే చెప్పాను. విని ఆనందించక విపరీతార్థాలు తీసి, సీరియస్ అయి పోతావా? అవునూ, నా మీద అనుమానమా నీకు?"

"ఆఁ...అదొక్కటే తక్కువైంది!"

"కాకపోతే ఈ ధోరణి ఏమిటోయ్ మరి? నీ




మొగుణ్ణి, ముగ్గురు పిల్లలకి తండ్రిని, నలభై దగ్గర పడుతున్న వాణ్ణి— మాట వరసకి— ఒక పడుచుపిల్ల వంక ఏదో ఉద్దేశంతో — ఆహాఁ, కోపం తెచ్చుకోకు. మాట వరసకే — చూశాననుకో. ఆ పిల్ల కూడా నా వంక అదే ఉద్దేశంతో చూస్తుం దన్న గ్యారంటీ ఏదీ?" అంటూ ఇంకా చెప్ప బోతుండగానే మధ్యలో అడ్డుకుంది.

"మీ మాటలకేం లెండి? ఒక టడిగితే వంద చదువుతారు గాని, నాకు తెలియక అడుగుతాను— ఆ పిల్ల ఒక్క జడ వేసుకొస్తే మీకేం— రెండు జడలు వేసుకొస్తే మీకేం? ఆ జడలమీద పందెం కట్టడం కూడాను! హవ్వ! సంసారులకి ఉండదగ్గ బుద్ధులేనా ఇవి?"

అసలు పందెం వేసుకున్నది అప్పలరాజూ, అంజిబాబూ. నేను మధ్యవర్తిని. అంటే నిమిత్తమాత్రుణ్ణి. కాని, ఈవిడగారు అదంతా నా ప్రయోజకత్వంగానే భావించి, అంతా నేనే చేశానని ఉద్దేశ పడుతూంది. ఆమెకు నామీద కలిగిన దురుద్దేశాన్ని తొలగించి, నేను నిరపరాధిని అన్న నిజాన్ని నిరూపించుకోవలసిన బాధ్యత నా మీద ఉంది కదా! అందుకని "ఇందులో నేను చేసిం దేమీ లేదోయ్! ఏదో ఆ కుర్రాళ్ళిద్దరూ ముచ్చటపడి పందెం వేసుకున్నారు. పెద్దవాణ్ణి కదా అని, సమయానికి అక్కడ ఉండబట్టి నన్ను మధ్యవర్తిగా ఉండమన్నారు. వాళ్ళ మాట కాదనలేక, వాళ్ళను నిరుత్సాహ పరచటం భావ్యం కాదని 'సరే' అన్నాను. అంతే" అని నచ్చ చెప్పటానికి ప్రయత్నించాను. కాని ఆవిడ అంతటితో వదిలి పెట్టలేదు.

"కుర్రవాళ్ళు—వాళ్ళకు బుద్ధి లేకపోయిందను కోండి. పెద్దలు కదా—మీ క్కూడా జ్ఞానం లేక పోయిందేం?"

"ఏమిటోయ్! బుద్ధీ జ్ఞానం అంటూ పెద్ద పెద్ద మాటలు వదిలేస్తున్నావ్? ఇందులో నా తప్పేం లేదంటే వినిపించుకోవేం? పెద్దవాణ్ణే కదా అని మధ్యవర్తిగా ఉండమన్నారు. వా ళ్ళంత గౌర వంగా అడుగుతున్నప్పుడు నా పెద్దరికాన్ని నిలబెట్టు కోవాలా, వద్దా? ఆహాఁ—నిలబెట్టుకోవాలా, వద్దా అని?" దబాయించబోయాను.

"పెద్దరికం నిలబెట్టుకోవాలంటే ఇంకెప్పుడూ ఇలాంటి పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యొద్దని బుద్ధి చెప్పాలిగాని, తగుదునమ్మా అని అడగగానే మధ్య వర్తిగా నిలబడి, ఇలాంటి అల్లరి చిల్లరి పనుల్ని ప్రోత్సహిస్తారా?" అని ఆవిడ నిలదీసి అడిగేటప్పటికి తెల్లమొహమే వెయ్యవలసివచ్చింది నేను.

నే నెలాంటి సమాధానమూ చెప్పకపోయేటప్పటికి మళ్ళీ ఆవిడే అందుకుంది— "మగ మహారాజులు. స్వేచ్ఛాజీవులు. బయటికి వెళ్ళిన తర్వాత ఇష్టం వచ్చి నట్టు వ్యవహరిస్తారు. గడప దాటి ఎరగని ఆడదాన్ని ఇలాంటి వన్నీ నాకేం తెలుస్తాయి, చెప్పండి? ఏదో ఇప్పుడు మీరు చెప్పారు గనుక ఈ విషయం తెలి సిందిగాని, లేకపోతే ఆ జడల వ్యవహారం నాదాకా

వచ్చేదా? నేను మిమ్మల్నిలా అడగటం జరిగేదా? వెళ్ళి కాళ్ళు కడుక్కు రండి, అన్నం వడ్డిస్తాను" అంది గుక్క తిప్పుకోకుండా, నన్ను గుక్క తిప్పుకో నివ్వకుండా.

ఆఫీసు నుంచి ఎంత ఉత్సాహంగా ఇంటికి వచ్చానో అంతకు రెట్టింపు నిరుత్సాహ పడవలసి వచ్చింది. కొన్ని కొన్ని విషయాలు వస్తుతః అంతగా ప్రాముఖ్యం లేనివే అయినా, అకారణంగా ఇలాంటి సిద్ధాంత రాద్ధాంతాలకి దారి తీస్తుంటాయి. అసలీ సందర్భంలో కాస్త ముందు జాగ్రత్త పడి ఉంటే, ఈవిడతో ఇంత రాద్ధాంతం జరక్కనే పోనుగదా!— అని విచారించాను.

అయితే, ఆ నిరుత్సాహం తాత్కాలికమే. భోజనం చేసి, మంచం ఎక్కేటప్పటికి తిరిగి మామూలు స్థితికే వచ్చేసింది నా మనస్సు.

రాత్రి నిద్దట్లో కల కన్నాను. ఆ కలలో పద్మలతాదేవి ఒక్క జడే వేసుకొచ్చింది. అది చూసి అప్పలరాజు — 'గెలుపు మనదేనండోయ్, గురూ గారూ!' అంటూ ఉత్సాహంగా జయధ్వానం చేశాడు. దానితో కల చెదిరి మెలుకువ వచ్చేసింది నాకు.

తెల్లవారుజామున మళ్ళీ కల వచ్చింది. ఈ సారి రెండు జడలు వేసుకొచ్చింది పద్మలతాదేవి. అంజిబాబు ఎగిరి గంతువేశాడు.

● ● ● ●

ఉదయం కార్యక్రమమంతా హుషారుగా ముగించేసి, అయిదు నిమిషాలు ముందుగానే ఆఫీసు చేరుకున్నాను.

అప్పటికే దాదాపు అందరూ వచ్చేసి ఉన్నారు. పద్మలతాదేవిమాత్రం ఇంకా రాలేదు.

ఆఫీసుకు వెళ్ళిన తరవాత తెలిసిన మరో కొత్త విశేషం ఏమిటంటే, మరో ఇద్దరు కుర్ర గుమాస్తాలు చెరో అయిదు రూపాయలు పై పందెం కాశారట!

ఆ పది రూపాయలూ రామదాసుగారు పట్టుకున్నారు.

ఆఫీసులో అందరికీ తెలిసిపోయిందీ పందెం విషయం — అయ్యగారికీ, అమ్మాయిగారికీ తప్ప.

అయ్యగారు దయచేసి గదిలో ఆసనం అలంకరించారు.

అమ్మాయిగారి రాకకోసం అందరి కళ్ళూ ఆత్రంగా ఎదురుచూస్తున్నాయి.

ఆఫీసు గడియారం టంగు టంగున పది కొడుతూండగా, ముహూర్తం పెట్టినట్టు ఆఫీసుముందు రిక్షా దిగింది పద్మలతాదేవి.

అందరి కళ్ళూ ఆమెకి స్వాగతం చెబుతున్నాయి.

ఎవరి సీటులో వారు కూచొని ఉన్నా, ఎవరూ పని ప్రారంభించలేదు. ఈ విషయం మేమిటో తేల్చుకోనిదే ఎవరికిమాత్రం పని చెయ్య బుద్ధవుతుంది?

రిక్షా దిగి, వానిటీ బాగ్ విలాసంగా ఊపుకొంటూ, ఎత్తు మడమలు టకటకా లాడించుకొంటూ, పంచకల్యాణిలా నడిచి వస్తూంది పద్మలతాదేవి.

అందరి కళ్ళూ ఆమె పైనే!

మా అందరి ముందు నుంచీ అదే తీరులో నడుచుకొంటూ, సరాసరి అయ్యగారి గదిలోకి వెళ్ళిపోయింది పద్మలతాదేవి, రిజిస్టర్‌లో సంతకం చేసి రావటానికి.

అంతవరకూ ఎంత కుతూహలంగా ఆమె వంక చూశామో, అంతకు రెండింతలు ఆశ్చర్య పడవలసి వచ్చింది మేము.

ఆశ్చర్యం నుంచి తేరుకుని, తల తిప్పి, పందెం, పై పందెం కాసిన కుర్ర గుమాస్తాల వంక చూద్దును గదా—పాపం, ఇంకా ఆశ్చర్యంలోనే మునిగిపోయి ఉన్నారు వాళ్ళు. వాళ్ళు ఆశ్చర్యంలోంచి తేరుకోవటానికి కొంచెం వ్యవధి పట్టింది. అది సహజమే. ఆ తర్వాత చిరునవ్వులు చిందించాయి వాళ్ళ ముఖారవిందాలు.

ఇంతకీ పందెం ఫలితాలు ఏమిటంటే —

పద్మలతాదేవి ఒక్క జడ వేసుకురాలేదు.

అలా అని రెండు జడలూ వేసుకోలేదు.

లేటెస్ట్ ఫాషన్ హెయిర్ స్టయిల్—ముడి చుట్టుకొచ్చింది!

అప్పటికే అయ్యగారు వేంచేసి ఉండడంవల్ల ఆ విషయంలో అక్కడ తర్జనభర్జనలకి అస్కారం లేకపోయింది.

లంచ్ అవర్‌లో అందరం హడావుడిగా క్లబ్ రూమ్‌లో పోగుపడ్డాం.

"జగమేమాయ!" అంటూ చిరునవ్వు చిందించారు రామదాసుగారు క్లబ్ రూమ్‌లో అడుగు పెడుతూనే. ప్రతి విషయాన్నీ వేదాంతానికి ముడిపెట్టి మాట్లాడటం ఆయన కలవాటు. కొంపదీసి ఇప్పుడు వేదాంతాన్ని రంగంలోకి దింపి, ఉపన్యాసం దంచుతాడేమోనని భయపడ్డానుగాని, మా అదృష్టం బాగుండి అలాంటి ప్రయత్నమేమీ చెయ్యలేదాయన. "ఇద్దరు వ్యక్తులు పందెం కాసినప్పుడు ఒకడు గెలవడం, రెండవవాడు వోడిపోవడం సహజం. పందెం కాసిన ఇద్దరూ వోడిపోవడమనేది విచిత్రమైన విషయం. ఇది అపూర్వం. అత్యంతాశ్చర్యకరం!' అంటూ తన అమూల్యమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

పందెం కాసిన వాళ్ళేమీ మాట్లాడలేదు.

మధ్యవర్తిగా ఇక్కడ నా కొంత బాధ్యత ఉండిపోయింది.

గెలిచినవారికి ఈ డబ్బు ఇవ్వాలన్నది పందెం షరతు.

ఒకరు గెలిచి, రెండవవారు వోడిపోతే పేచీయే లేకపోను. ఇద్దరూ వోడిపోయారే! ఈ డబ్బు ఎవరి కిచ్చేట్లు?

ధర్మసంకటంలో పడిపోయాను నేను.

"మరిప్పుడేం చేద్దాం?" అన్నాను అందర్నీ ఉద్దేశించి.

మళ్ళీ రామదాసుగారే అందుకున్నారు. "చెయ్యటాని కేముంది ఇందులో గెలిచినవారికి ఈ డబ్బు ఇవ్వాలన్నది మన పందెం షరతు. వీళ్ళిద్దరూ గెలవలేదు. అంటే అర్థం పాపం, వోడిపోయారు. వీళ్ళిద్దర్నీ గెలిచిన గౌరవం ఆ పద్మలతాదేవికే దక్కింది. ఆమె అక్కడ నిశ్చింతగా కూచుంది—పందెం విషయం తెలీదు గనుక. మన ఒప్పందం ప్రకారం గెలిచినవారికే ఈ డబ్బు ఇవ్వాలనుకొంటే, నా ఉద్దేశం ప్రకారం ఆమెకే ఇవ్వాల్సి ఉంటుంది. కాని, అలా ఇవ్వలేం—సభ్యతగా ఉండదు కనుక. అందుచేత, నా కో ఆలోచన తడుతూంది. మనం దాదాపు అందరం ఇక్కడే ఉన్నాం కదా! ఈ డబ్బును ఏం చెయ్యాలి?—అన్న విషయమై 'వోటింగ్' పెడతాం. మెజారిటీని బట్టి నిర్ణయం తీసుకోవచ్చు. పందెం తాలూకు ఇరవై రూపాయలూ, పై పందెం తాలూకు పది రూపాయలూ. . .మొత్తం ముప్పై రూపాయలున్నాయి. ఈ ముప్పై రూపాయలతో మనమంతా వో చిన్న టీపార్టీ లాంటిది చేసుకోవటం సమంజసంగా ఉంటుందని నా అభిప్రాయం. దీనికి ఎంతమంది సుముఖులో చేతులెత్తండి!" అన్నారు రామదాసుగారు.

రామదాసుగారు అఖండుడు!

"బాగుంది. ఈ అయిడియా బ్రహ్మాండంగా ఉంది. ఎత్తండి. ఎత్తండి" అంటూ అందరూ హుషారుగా చేతులు పైకెత్తేశారు.

ఆ డబ్బుగలవారు మాత్రం చేతులు పైకెత్త లేకపోయారు. అలా అని మెజారిటీ మాట కాదనలేరు కదా!

'మా నలుగురి డబ్బుతో మీరంతా పార్టీ చేసుకుంటారా? అన్నట్లు దీనంగా ఉన్నాయి పాపం, వేలాడవేసిన వాళ్ళ ముఖాలు! ★

